క్లుప్తంగా

ఎమ్మెల్యే బొల్లా క్రిస్మస్ శుభాకాంక్షలు



వినుకొండ(నూజెండ్ల) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏసుక్రీస్తు దీవెనలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న సిలువధారి పద్యనాటకం



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో రాష్ట్రస్థాయి క్రీస్తు గానలహరి కార్యక్రమంలో భాగంగా 2వ రోజు సిలువధారి పౌరాణిక పద్య నాటక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. అదేవిధంగా బాలనాగమ్మ, దేవనర్తకి తదితర నాటకాలను ప్రదర్శించారు. అదేవిధంగా క్రీస్తు జననం, సత్యహరిశ్చంద్ర పద్యనాటకాలతో జయమో జగనన్న అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు మందా వెంకట్రావు తెలిపారు. ర్యక్రమంలో రెడ్డిబోయిన చిన్న, గుంజి చిన్న ఏసోబు, దాసు, డాలర్ ప్రభు, ముత్తినేని గిరిబాబు, ఎం.ఎస్.రాజు, నిరంజన్, ముత్తినేని గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నూతన వస్త్రాలు అందజేత



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఎనిమిది మంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి నెలా ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. సీహెచ్ రాఘవేంద్రరావు, మల్లికార్జున శాస్త్రి, దిట్టకవి శ్రీనివాసాచార్యులు, చంద్రమౌళి శాస్త్రి, హనుమంతరావు, సుదర్శన శర్మ, శ్రీనివాసశర్మ, నారాయణరావు, నాగభూషణం, సీతారామమూర్తి, గాలి శ్రీనివాసరావు, పాలుట్ల రవికిరణ్, విశ్వనాథ శాస్త్రి, భద్రయ్య, మురళీధర్, రవికుమార్, శంకరరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా కలశాల శోభాయాత్ర



రొంపిచర్ల: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజ అక్షితల పవిత్ర కలశాలకు ఆదివారం రొంపిచర్లలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 32 గ్రామాలకు అవసరమైన అక్షిత కలశాలను వారివారికి అప్పగించారు. శ్రీరామ జయరామ జయజయ రామ తారక మంత్రంతో శోభాయాత్ర సాగింది. శోభాయాత్ర అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు గొడవర్తి వెంకటేశ్వర్లు, పూజల కొండలు, కాటా అంజనారెడ్డి, గాదె రామిరెడ్డి, పేరేచర్ల కోటేశ్వరరావు, సోముపూర్ణ, బలరామరాజు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

ముప్పాళ్ళ: రబీ సీజన్‌లో భాగంగా అక్టోబర్ 1వ తేదీ తర్వాత సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు 80% సబ్సిడీపై 865 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేశామని, విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మిరప, మొక్కజొన్నతో పాటు సాగు చేసిన పంట వివరాలను ఆర్బీకేలోని వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా నమోదు చేపట్టవచ్చన్నారు.

నేడు తాళ్లచెరువులో బాలఏసు తిరునాళ్ల మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువులో నూరు సంవత్సరాల చరిత్ర గల బాలఏసు దేవాలయ తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశారు. ఇంగ్లండ్‌కు చెందిన స్వామి అర్లానంద 1892లో తాళ్లచెరువు గ్రామాన్ని నిర్మించారు. ఈ ప్రాంతంలో నివసించేవారికి క్రైస్తవ మత విశిష్టతను తెలియజేసి మత ప్రబోధం చేశారు. 1950లో గ్రామం నడిబొడ్డులో బాలఏసు మందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబర్ 25న వచ్చే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బాలఏసు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఈ సందర్భంగా 25న ఉదయం 9గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ప్రారంభమవుతాయి. విచారణ గురువులు పుట్టి అంతోనిరాజు, సహాయ విచారణ గురువులు కఠారి కిరణ్, ఫాదర్ పాతిమామర్రెడ్డిలచే బైబిల్ పఠన, దివ్యబలిపూజలు, వాహన పూజలు నిర్వహిస్తారు. తాళ్లచెరువు గ్రామ సృష్టికర్త స్వామి అర్లానంద విగ్రహానికి నివాళులర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల నుంచి బాణసంచాతో తాళ్లచెరువు గ్రామ వీధులలో బాలఏసు తేరు(రథం) ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నారు.

● క్రిస్మస్ కాంతులు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చర్చిలు విద్యుద్దీప కాంతులతో శోభిల్లాయి. నరసరావుపేట స్టేషన్‌రోడ్డులోని టౌన్ బాప్టిస్ట్ చర్చి, చిలకలూరిపేటరోడ్డులోని లూథరన్ చర్చి, బస్టాండ్ సమీపంలోని మిలినియం చర్చి, రైల్వేస్టేషన్ సమీపంలోని పరిశుద్ధ పౌల్ చర్చి, వినుకొండ ఇమ్మానియేల్ తెలుగు బాప్టిస్టు చర్చి తదితర చర్చిలు విద్యుద్దీపకాంతులతో నూతన శోభ సంతరించుకుని, ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమయ్యాయి.

– నరసరావుపేట ఈస్ట్, వినుకొండ, యడ్లపాడు



విద్యుద్దీప కాంతుల్లో నరసరావుపేట టౌన్ బాప్టిస్ట్ చర్చ్



వినుకొండలో ముస్తాబైన ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి



రావిపాడులోని తెలుగు బాప్టిస్ట్ చర్చి



దీపకాంతులతో వెలిగిపోతున్న తిమ్మాపురం లూథరన్ చర్చి

ప్రేమ, శాంతి, కరుణకు చిహ్నం క్రిస్మస్

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు శనివారం తెలియ చేశారు. ప్రేమ, శాంతి, కరుణ చూపించే ఏసుక్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులు అందరూ సుఖ శాంతులతో పండగ పర్వదినాన్ని వైభవంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

రేపు వాహనం వేలం

చిలకలూరిపేటటౌన్: అర్బన్ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో ఈ నెల 26 తేదీ ద్విచక్రవాహనానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అర్బన్ సీఐ సీహెచ్ సీతారామయ్య చెప్పారు. హీరో హెచ్ఎం డీలక్స్ వాహనాన్ని ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.
సదరు వాహనం ఖరీదు రూ. 7వేలుగా నిర్ధారించారని, పాట పాడే వ్యక్తులు దరావత్తుగా రూ. 2వేలు చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ ఖర్చులతో పాటు, 12 శాతం జీఎస్టీ చెల్లించాలని చెప్పారు. పాట పాడే వ్యక్తి మొత్తం సొమ్మును అదే రోజు చెల్లించాలన్నారు.

ప్రేమతత్వానికి ప్రతిరూపం ఏసుక్రీస్తు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: ప్రేమతత్వానికి ప్రతి రూపమే ఏసుక్రీస్తు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని సంజీవనగర్ చర్చి ప్రాంగణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొని మాట్లాడుతూ సరైన మార్గంలో మానవ జీవన విధానం గురించి క్రైస్తవ్యం తెలుపుతుందన్నారు. మనస్పర్థలు, స్వార్థం, కోపం, ఆవేశం వంటి లక్షణాలను వదలివేయాలన్నారు. ప్రజలంతా ఒకరినొకరు ప్రేమించుకుంటూ శాంతి స్వభావులుగా ఉండాలని పేర్కొన్నారు. ఇదే క్రీస్తు సందేశమని వివరించారు. క్రిస్మస్ స్ఫూర్తిని మనం ఎప్పటికీ కొనసాగించాలని, అప్పుడే మనమందరికీ నిజమైన క్రిస్మస్ అని వెల్లడించారు. పొరుగు వారిని ఆదుకోవడం, సంఘసేవ గురించి ఏసుక్రీస్తు బోధించారని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, తాళ్ల అంజిరెడ్డి, కొచ్చెర్ల కిషోర్, పంగులూరి వెంగళరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేలూరులో ...

మండలంలోని వేలూరు గ్రామంలో ఏబీఎం చర్చి ప్రాంగణంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మల్లెల రాజేష్ నాయుడు మాట్లాడుతూ క్రిస్మస్ కేవలం క్రైస్తవుల పండుగ మాత్రమే కాదని, అది అందరి పండుగ అని వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘస్తులతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, బొంతా అబ్రహం, బొంతా రవి, బ్రహ్మయ్య, భాగ్యారావు, వినయ్, లక్ష్మయ్య,నతానియేలు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని చీరాలరోడ్డులోని వెంకటరెడ్డికాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ..

చిలకలూరిపేట: వృద్ధుల పట్ల ప్రేమ, ఆదరణ చూపడం అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. మహేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కాసువెంగళరెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం వృద్ధులకు దుస్తుల పంపిణీ అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ యువత వృథా ఖర్చులకు పోకుండా ప్రతి ఏటా క్రిస్మస్‌ను పురస్కరించుకొని వృద్ధుల పట్ల ఆదరణ చూపడం, సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆదర్శనీయమన్నారు. ఏడో వార్డు కౌన్సిలర్ చెమిటిగంటి పార్వతిదేవి, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్ల అంజిరెడ్డి, పంగులూరి వెంగళరాయుడు పాల్గొన్నారు.

శరవేగంగా జలజీవన్ మిషన్ పనులు



వేల్పూరులో పైపులైను నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

శావల్యాపురం: జలజీవన్ మిషన్ నిధులు రూ.1.80 కోట్ల వ్యయంతో వేల్పూరు, వెలమవారిపాలెం గ్రామాల్లో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఫణిదపు శంకరబాబు తెలిపారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్‌ల సారథ్యంలో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి మంచినీటి చెరువు వరకు 1800 మీటర్ల మేర సిమెంటు పైపులైను నిర్మాణ పనులు తుదిదశకు చేరినట్లు చెప్పారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలో 550 ఇంటింటికి నీటి కుళాయిలు పైపు లైను పనులు కూడా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తు తరాలవారికి మంచినీటి సమస్య లేకుండా ఉండేలా ఆధునికీకరణ యంత్ర పరికరాలను ఏర్పాటు చేసి పనులు రెండు నెలల వ్యవధిలో పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అలాగే వెలమవారిపాలెం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు చేపట్టామన్నారు. మండలంలోని చినకంచర్ల గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు ఇంటింటి నీటి కుళాయి పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

చిరకంచర్లలో గుండె వైద్య శిబిరం



శిబిరంలో ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్యులు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చినట్లు అమ్మ డిజిటల్ ఫ్లెక్సీ ప్రతినిధి పాపసాని సురేష్ ఆదివారం తెలిపారు. విజయవాడకు చెందిన హెల్త్ హాస్పిటల్ సారథ్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 20 మందికి ప్రత్యేక వైద్యసేవలు చేసినట్లు చెప్పారు. వైద్య నిపుణులు సాయి, శివప్రసాద్, సర్పంచులు పురేటి నాగేశ్వరరావు, పాపసాని విజయలక్ష్మి, పురేటి రామాంజినేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యడ్లపాడులో ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: స్థానిక పియర్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావు పాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బీపీ, షుగర్, పక్షవాతం సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ లింగమల్లు మోహన భాస్కర్, జూనియర్ వైద్యులు గుంటుపల్లి భవ్యతేజ, ఫార్మాసిస్ట్ రావూరి సౌమ్య, రవీంద్ర బాబు, బి.రాజేష్, సామినేని శ్రీనివాస్, సిహెచ్ రంగారావు, రామోజీ కోయ, తోకల నాగరాజు పాల్గొని వైద్య సేవలు అందించారు.

కనపర్రులో ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో నరసరావుపేట రాఘవేంద్ర హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు ఫణిభార్గవ్, సత్యకృష్ణ దీపిక, సంజీవ్ పాల్గొని సుమారు 150 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వైద్య శిబిరానికి సహకరించిన గ్రామ ఆర్ఎంపీ షేక్ మౌలాలి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా గ్రామంలో రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. తాను ఆర్ఎంపీగా గత ఇరవై ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులను గ్రామస్తులతో కలిసి సన్మానించారు. మరికొంతమందిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు.

బాలోత్సవ్‌లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ఆదివారం జరిగిన బాలోత్సవ్ పోటీల్లో పాల్గొని 11 బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం షేక్ మహమ్మద్ సుభాని తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కోలాటం, మ్యూజిక్, క్విజ్, తదితర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారన్నారు. విజేతలను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమత్ హనుమత్ వ్రత వేడుకలు

అమరావతి: శ్రీమత్‌హ నుమత్ వ్రతాన్ని పరస్కరించుకుని ఆదివారం ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని ప్రసన్నాంజనేయస్వామి వారికి ప్రత్యేకపూజలు, ఆకుపూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేసి వడమాలలు సమర్పించుకున్నారు. తొలుత ఆలయ అర్చకుడు పరుచూరి కేశవచార్యులు స్వామి వారికి పంచామృత స్నపన, సహస్రనామాలతో తమలాపాకులతో పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

పెరియార్ రామస్వామి వర్ధంతి

సత్తెనపల్లి: సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి 50వ వర్ధంతి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకుడు కంటూ వెంకట్రామయ్య మాట్లాడుతూ పెరియార్ హేతువాదం, ఆత్మగౌరవం, మహిళల హక్కులు, కులనిర్మూలన సూత్రాలను ప్రచారం చేశారన్నారు. ఆయన దక్షిణ భారతదేశంలోని బ్రాహ్మణేతర ద్రావిడ ప్రజల దోపిడీ, అట్టడుగున చేయడాన్ని వ్యతిరేకించాడన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంజి విజయ్‌కుమార్, కుమ్మరి దస్తగిరి, షేక్ చిన్న షరీఫ్, పిక్కలి రత్తయ్య, మల్ల వెంకటేశ్వర్లు, చింకా అంకమ్మరావు, పిక్కలి శివ, గుంటూరు గోవిందు, కంటూ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటిని కాచి చల్లార్చి వినియోగించండి

సత్తెనపల్లి: పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని కాచి, చల్లార్చి, వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. పురపాలక సంఘానికి చెందిన మంచినీటి నిల్వ చెరువులో నీటిమట్టం రోజు రోజుకు తగ్గు ముఖం పడుతున్నందున కుళాయిల ద్వారా సరఫరా చేయుచున్న మంచినీరు కొంత రంగు మారడం జరుగుతుందన్నారు. నాగార్జునసాగర్ కాలువల ద్వారా మంచినీటి చెరువులకు నీరు విడుదల చేసే వరకు పట్టణ ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణం సమీపంలో ఉన్న మాచర్ల రోడ్డులోని బృందావనం ధాబా-ఫ్యామిలీ రెస్టారెంట్ దగ్గర ఆదివారం జరిగింది. క్రోసూరు మండలం హస్సనాబాద్ గ్రామానికి చెందిన ఎం.ఆంజనేయులు, తన అత్త మస్తానమ్మ ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వస్తున్నారు. పట్టణంలోని బృందావనం ఫ్యామిలీ రెస్టారెంట్ దగ్గర ద్విచక్రవాహనాన్ని గేదె ఢీ కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 ద్వారా క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా..

సత్తెనపల్లి అంబేడ్కర్ నగర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 31వ వార్డు మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంచేలా క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించనుందని, ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో మెలకువలను తెలుసుకొని ముందుకు వెళ్లాలన్నారు. క్రీడల వలన పోటీతత్వం పెరుగుతుందన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలుగు తీయడమే లక్ష్యంగా పోటీలను నిర్వహించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న పాస్టర్ ఫిలిప్, న్యాయవాదులు



విమోచన ప్రార్థన మందిరంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ సీహెచ్ యెహెజ్కేలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక న్యాయవాద సంఘ భవనంలో క్రిస్టియన్స్ అడ్వకేట్స్ ఫోరం ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇమ్మానుయేలు తెలుగుబాప్టిస్ట్ చర్చి పాస్టర్ పి.ఫిలిప్ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ ముట్లూరి ఎలీషాబాబు, సీనియర్ న్యాయవాది పీజీ లూకా, ఏజీపీ ఎం.ఎస్.ప్రసాద్, గంధం వెంకటేశ్వర్లు, న్యాయవాదుల సంఘం ప్రెసిడెంట్ చాగంటి వీరాంజనేయచౌదరి, కోపెల దేవరాజ్, కె.హనుమంతరావు, జి.హరిప్రసాద్, ఎన్.అశోక్‌బాబు, ఎం.వి.అప్పారావు, తలారి ఆంజనేయులు, నీలం శేఖర్‌బాబు, మల్లికార్జునరెడ్డి, తిరుపతిరావు, కుమార్, డి.నాగరాజు, ముట్లూరి చంటి, వై.చిరంజీవి, బి.నాగరాజు, గాయత్రి, కాలేశ్వర రెడ్డి, నాగూర్, కాళింగ చెన్నయ్య పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామంలో విమోచన ప్రార్థన మందిరంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా విమోచన ప్రార్థన మందిరం పాస్టర్ సీహెచ్ యెహెజ్కేలు పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు లోక రక్షకుడని, శాంతి, కరుణ, ప్రేమ, దయలతో ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఆదివారం రాత్రి క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి భక్తిగీతాలు అలపించారు. పాస్టర్ సీహెచ్ కస్తూరి, ప్రశాంత్ నిశాంత్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

కే-రిడ్జిలో ముగిసిన ఉన్నతి ఫెస్ట్



బహుమతులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ నాతాని, డైరెక్టర్ కల్నల్ వాసిరెడ్డి, నాసరయ్య

నరసరావుపేట ఈస్ట్: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సృజనాత్మకతో కూడిన విద్యను అందించాలని కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కే-రిడ్జి పాఠశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన ఉన్నతి ఫెస్ట్ ఆదివారం ముగిసింది. తొలిరోజు శనివారం రోబోటిక్ వర్క్‌షాప్, రెండవరోజు చిన్నారులకు విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.
ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని మాట్లాడుతూ, రానున్న రోజుల్లో కృత్రిమ మేధ అధిక ప్రాధాన్యత కలిగి ఉంటుందని తెలిపారు. మారుతున్న విద్యా విధానంలో భాగంగా సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను చిన్నారులకు అందించి వారి ఉన్నతికి దోహదపడాలని కోరారు. శనివారం వర్క్‌షాప్‌లో భాగంగా రోబోటిక్స్ తయారు చేయటంపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిచే రోబోలను తయారు చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన రోబోలు ఆకట్టుకున్నాయి. రెండవరోజు ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన, రంగోళి, మెహందీ, మిస్ అండ్ మిస్టర్, ఫ్యాషన్ షో, సంగీతం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ కల్నల్ వాసిరెడ్డి రవిశంకర్, ప్రిన్సిపాల్ మల్లేశ్వరి, డాక్టర్ రంజిత్, ట్రైనర్ సుమిత్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: మహిళల అభివృద్ధికి పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సోషల్ కృషి చేయటం ఎంతో అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నరిశెట్టి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన మాచర్లలో పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సోషల్ అధ్యక్షురాలు యరబోతుల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 50 మంది మహిళలకు ఉచితంగా సొసైటీ తరపున కుట్టుమిషన్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల ప్రాంతంలో ఎనలేని సేవ చేస్తున్న కోటేశ్వరి సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. సొసైటీ అధ్యక్షురాలు కోటేశ్వరి మాట్లాడుతూ ఇప్పటి వరకు 50 మందికి కుట్టుమిషన్లు అందజేయటం జరిగిందని, మరో 60 మందికి అందిస్తామన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమన్నారు. అందులో భాగంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీను, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.